క్లుప్తంగా

చట్టాలను గౌరవించాలి

బజార్‌హత్నూర్: యువత చట్టాలను గౌరవించి, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని బోథ్ సీఐ రమేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్, మత్తుపానీయాల వలన జరిగే పరిణామాల గురించి అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థి తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై అప్పారావ్, ప్రిన్సిపాల్ సునీల్, అధ్యాపకులు ప్రదీప్, భీమేష్, అశోక్‌రెడ్డి, సుభాష్, గంగాధర్, హైమద్ పాల్గొన్నారు.

వాలీబాల్, క్రికెట్ కిట్లు అందజేత

బేల: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకులం పాఠశాలలో విద్యార్థుల కోసం బుధవారం బీజేవైఎం అధ్యక్షుడు పోత్రాజ్ నవీన్ వాలీబాల్, క్రికెట్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరికృష్ణ, మాజీ సర్పంచ్ ఇంద్రశేఖర్, నాయకులు తాక్రే సందీప్, కోడే ప్రదీప్, అక్షయ్, మనోజ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

తాంసి: భీంపూర్ మండలంలోని తాంసి(కె) గ్రామానికి చెందిన మహిళ ఆత్రం గంగుబాయి (32) అదృశ్యమైంది. మంగళవారం సాయంత్రం భర్త సందీప్‌తో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో చుట్టూ పక్కల గాలించారు. అయినా.. ఆమె ఆచూకి లభించలేదు. తండ్రి మడావి భగవాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కలీం తెలిపారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

ఇచ్చోడ: అందరి సహకారంతోనే కళాశాల మరింత అభివృద్ధి చెందుతుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని అడేగామ(బి) గ్రామానికి చెందిన కదం గోపిరాజ్ కళాశాలకు 10 కుర్చీలు విరాళంగా అందచేశారు. ఇక్కడి ప్రాంత ప్రజల సహకరంతో కళాశాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు సరస్వతి, కటకం మురళీ, మధు, సరిత, దయాకర్, విజయ్, తిరుపతి, నర్సయ్య, ప్రభాత్, పాల్గొన్నారు.

అంగన్‌వాడీల తనిఖీ

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో సురేఖ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి చిన్నారుల హాజరు శాతం, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం తీరును అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా పిల్లల బరువు, ఎత్తును రికార్డులలో నమోదు చేయాలన్నారు. ఏసీడీపీవో నర్సమ్మ, సూపర్‌వైజర్ ముంతాజ్, అంగన్‌వాడీలు రాధ, సుజాత, ప్రియ ఉన్నారు.

అందర్‌బంద్‌లో వైద్య శిబిరం

తాంసి: భీంపూర్ మండలంలోని అందర్‌బంద్ గ్రామంలో బుధవారం ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అలాగే ఆశ్రమ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి కృష్ణవేణి, కార్యక్రమంలో హెచ్‌ఈవో జానేశ్వర్,సాహితి, ఏఎన్ఎం విజయలక్ష్మి, పార్వతి, గోదావరి పాల్గొన్నారు.

వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: సోషల్ మీడియాలో ఓ మతాన్ని కించపరిచే విధంగా పోస్టు పెట్టిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లుగా వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఇన్‌స్టాగాంలో మతానికి సంబంధించి పోస్టు చేశారని బీజేపీ నాయకుడు రాకేశ్ ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టి పోస్టు పెట్టిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లుగా పేర్కొన్నారు.

మట్కా నిందితుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: అమాయక ప్రజలను మట్కా ఉచ్చులోకి దించుతున్న నిందితుడు అబ్దుల్ అమీర్‌ను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఏఎస్సై రమేశ్ తెలిపారు. పట్టణంలోని తాటిగూడకు చెందిన అమీర్‌ను బుధవారం తిర్పెల్లిలోని తెల్లకల్లు బట్టీ వద్ద మహాలక్ష్మివాడకు చెందిన శ్రీనివాస్‌కు మట్కా చిట్టీలు రాస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఆయన నుంచి రూ.10,750 నగదుతో పాటు మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మట్కాను ప్రోత్సహిస్తున్న శ్రీనివాస్‌తో పాటు మరో పది మంది పరారీలో ఉన్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కేసులు పరిష్కరించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా జడ్జి కె.ప్రభాకర రావు అన్నారు. సెప్టెంబర్ 28న నిర్వహించనున్న లోక్ అదాలత్‌కు సంబంధించి బుధవారం జిల్లా కోర్టు హాల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా చూడాలని సూచించారు. సమయంతో పాటు డబ్బు ఆదాయ అవుతుందన్నారు. జడ్జిలు శివరాంప్రసాద్, మంజుల, ప్రమిళ జైన్, దుర్గరాణి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా పాల్గొన్నారు.

ఓటర్ల సర్దుబాటు..!

- కొనసాగుతున్న ప్రక్రియ
- మండలంలో 34 జీపీలు.. 280 వార్డులు
- మహిళా ఓటర్లు 15,067, పురుష ఓటర్లు 14,366
- సిద్ధమవుతున్న ఆశావహులు



ఓటర్ల సర్దుబాటు చేస్తున్న అంకోలి పంచాయతీ కార్యదర్శి

ఆదిలాబాద్‌రూరల్: గత ఫిబ్రవరి 1న గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల పదవీ కాలం ముగిసిన విషయం తెలిసిందే. వారి పదవీ కాలం ముగియడంతో 2వ తేదీ నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. అయితే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రస్తుతం అధికారులు గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వివిధ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగానే మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఒక కుటుంబానికి సంబంధించిన వారి ఓటర్లు ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం వార్డుల వారీగా ఓటర్ల సర్దుబాటు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రక్రియ ఈ నెల 21న ప్రారంభమైంది. దీంతో జీపీలలో పంచాయతీ కార్యదర్శులు బిజీబిజీగా ఉన్నారు. ఈప్రక్రియ ముసిగినంతరం సెప్టెంబర్ 6న వార్డుల వారీగా ముసాయిదాను సిద్ధం చేసి అయా గ్రామ పంచాయతీ పరిధిలోని ఓటర్లకు అందుబాటులో ఉంచనున్నారు. 7 నుంచి 13 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. 9, 10 తేదీల్లో రాజకీయ పార్టీల నేతలతో సమావేశాలు నిర్వహించి వారి సూచనలు స్వీకరించనున్నారు. అనంతరం 21న వార్డుల వారీగా తుది జాబితాను ప్రచురించనున్నారు.

మొత్తం ఓటర్లు 29,433..

ఆదిలాబాద్ రూరల్ మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఆయా గ్రామ పంచాయతీలలో 280 వార్డులు ఉన్నాయి. ప్రస్తుతం వార్డుల వారీగా ఓటర్ల సర్దుబాటు ప్రక్రియ కొనసాగుతోంది. మహిళ ఓటర్లు 15067, పురుష ఓటర్లు 14,366, మొత్తం మండల ఓటర్లు 29,433మంది ఉన్నారు.

ఆశావహుల ఆశలు..

వార్డుల వారీగా ఓటర్ల జాబితా సర్దుబాటు ప్రక్రియ గ్రామ పంచాయతీలలో ప్రారంభం కావడంతో రాబోయే సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలలో పోటీ చేసేందుకు ఆశవహులు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు. వ్యక్తి గత పనులు ఎంత ముఖ్యంగా ఉన్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ రాబోయే సర్పంచ్, వార్డు స్థానాలలో పోటీ చేయాలనుకుంటునని, మీతో పాటు మీ కుటుంబసభ్యుల సహకారం కావాలని కోరుతున్నారు.

సర్దుబాటు చేస్తున్నాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ వార్డుల వారీగా సర్దుబాటు కొనసాగుతోంది. అందులో బాగంగానే ఆయా జీపీల పంచాయతీ కార్యదర్శులు వారి వారి జీపీల పరిధిలోని వార్డుల్లో ఒకే కుటుంబానికి సంబంధించిన ఓటర్లు ఒకేవార్డులో ఉండేలా సర్దుబాటు చేస్తున్నారు.

– ఆనంద్, ఎంపీవో, ఆదిలాబాద్ రూరల్

బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టాలి



మాట్లాడుతున్న కదం బాబురావ్

బజార్‌హత్నూర్: మండలంలో అధిక సంఖ్యలో బీజేపీ సభ్యత్వ నమోదు చేయాలని బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గం కో కన్వీనర్ కదం బాబురావ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పెరుగు సంతోష్, నానం రమణ, పండగ మురళీ మోహన్, సురేశ్, శ్రీకాంత్, బలిరాం, ఈశ్వర్, రాజు, నంది నర్సయ్య, జాంసింగ్, ప్రకాష్ పాల్గొన్నారు.

నేరడిగొండ: పార్టీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీం రెడ్డి అన్నారు. మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ అధ్యక్షతన బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు సమావేశానికి హాజరయ్యారు. మండలంలోని ప్రతీ పోలింగ్ బూత్ నుంచి 250 సభ్యత్వాలు చేయాలన్నారు. అనంతరం పోలింగ్‌బూత్ వారీగా ఇన్‌చార్జిలను నియమించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గట్టు నారాయణ, మండల ఉపాధ్యక్షుడు సాబ్లే కేవల్‌సింగ్, బాక్రే లక్ష్మణ్, చెట్‌పల్లి వెంకటేశ్, లింగంపల్లి సురేశ్ పాల్గొన్నారు.

ఘనంగా కోనేరు ప్రతిష్ఠాపన మహోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయంలో కోనేరు ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం కోనేరు ఏర్పాటు చేసి తొమ్మిది పవిత్ర నదుల నుంచి జలాన్ని సేకరించడం అభినందనీయమన్నారు. ఆలయానికి అనుకొని ఉన్న చాందా (టి) వాగు కలుషితం కాకుండా ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుంభోజి సూర్యకాంత్, దాముక రవి, గౌరవ అధ్యక్షుడు దారట్ల జీవన్, చిందం దేవిదాస్, దిలీప్, అనీల్ దేశ్‌పాండే, అర్చకులు మూర్తి, సంతోష్ శర్మ పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని అరికట్టాలి



చెరువులో చేపలను వదులుతున్న సిబ్బంది

జైనథ్: దోమల వ్యాప్తిని అరికట్టడంతో అనేక రోగాలను నివారించవచ్చని జైనథ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు నైనత సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక చెరువులో వైద్య సిబ్బంది, ఇతర అధికారులతో కలిసి గంబోసియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గంబోసియా చేపలు దోమల లార్వాలను తినడంతో, దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. ప్రతిఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముజీబ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



ప్రత్యేక పూజలు చేస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని తాటిగూడ హనుమాన్ ఆలయం ముఖ ద్వారం ఏర్పాటు, తిరుమలనగర్‌లోని నూతన దక్షిణామూర్తి హనుమాన్ ఆలయాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించే దిశగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అశోక్ స్వామి, గణేష్, దేవిదాస్, భోజారెడ్డి, రవి, అశోక్, రవీందర్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



తనిఖీ చేస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్

నార్నూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్ అన్నారు. బుధవారం మండలంలోని తాడేహత్నూర్ సబ్‌సెంటర్లును పరిశీలించారు. రికార్డులను పరిశీలించి, సీజనల్ వ్యాధులపై క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలా అవగాహన కల్పించాలని సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణ కోసం గ్రామాలలో శానిటేషన్, క్లోరినేషన్‌పై గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి పని చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యాధికారి రాంబాబు, హెచ్‌ఈవో నాందేవ్, సూపర్‌వైజర్ చౌహాన్ చరందాస్, కైలాస్ సింధు, ఈశ్వర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పాము కలకలం

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో నాగుపాము కలకలం రేపింది. ఉదయం సమయంలో అంగన్‌వాడీ టీచర్ పిల్లలతో కలిసి గదిలోకి వెళ్లగా గుడ్ల పక్కన పాము సంచరిస్తూ.. కనిపించింది. వెంటనే అప్రమత్తమైన టీచర్ సరిత విద్యార్థులకు బయటకు పంపించి, గ్రామస్తులకు సమాచారం ఇచ్చింది. స్థానికులు పామును గది నుంచి బయటకు తీసుకొచ్చి చంపారు.

నీటి సమస్యపై ఆరా

సాక్షి ఎఫెక్ట్..

నార్నూర్: మండలంలోని భీంపూర్ గ్రామంలోని ఎస్టీ బాయ్స్ హాస్టల్‌లో గత రెండు రోజులుగా విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. దీంతో 'ఎస్టీ హాస్టల్‌లో నీటి సమస్య' కథనాన్ని బుధవారం సాక్షి ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన ఏటీడీవో క్రాంతికుమార్ హాస్టల్‌ను సందర్శించారు. నీటి సమస్యపై ఆరా తీశారు. వార్డెన్ తిరుమలతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాలని, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. మరమ్మతులు చేయించి నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామని తెలిపారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు



తీజ్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు

నార్నూర్: మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. లంబాడాలు సంప్రదాయ ఆటపాటలతో హోరెత్తించారు. తొమ్మిది రోజులు నియమ నిష్ఠలతో ఉపవాస దీక్షలు చేపట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విఠల్, వార్డెన్ వనిత, పీఎస్ హెచ్‌ఎం నీలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని మేడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం తీజ్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తీజ్ ముగింపు ఉత్సవాల సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ప్రతీ విద్యార్థి సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

ఆదిలాబాద్‌టౌన్: ప్రతీ వి ద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యా యసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. బు ధవారం ఆదిలాబాద్ పట్ట ణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చ ట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహం, గృహ హింస చట్టం, వరకట్న నిషేధ చట్టం, పోక్సో యాక్ట్ చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జాదవ్ గణేష్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

కైలాస్‌నగర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవన్‌లో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అర్లి(బి)మాజీ సర్పంచ్ అయిటి వినోద్, వార్డు మెంబర్ కుమ్ర పెంటన్న ఆధ్వర్యంలో గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే పట్టణంలోని 15వ వార్డు సుందరయ్యనగర్‌కు చెందిన కాలనీవాసులు సైతం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ అంటేనే పేదలు, గరీబోళ్ల పార్టీ అని అన్నారు. తాము పాలకులం కాదు, సేవకులమన్నారు. రైతు పక్షపాతిగా అర్హులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 17 నుంచి కొత్త రేషన్ కార్డులు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్, జహీర్ రంజానీ, సంద నర్సింగ్, మహేందర్ పాల్గొన్నారు.

అమరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

ఎదులాపురం: విద్యుత్ అమరవీరుల పోరాట స్ఫూర్తితో ప్రజాసమస్యలపై ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో విద్యుత్ అమర వీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సంస్కరణల పేరుతో విద్యుత్ రంగాన్ని 2000 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసి, విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచిందన్నారు. చార్జీలు భరించలేని ప్రజలు తిరుగుబాటుకు దిగారన్నారు. పోలీసులు తుపాకీ గుండ్ల వర్షం, నీటి ఫిరంగులు, లాఠీచార్జీలకు బెదరకుండా పోరాటం కొనసాగించారని గుర్తు చేశారు. ఆనాటి పోరాట ఫలితంగానే తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను తీసుకొచ్చిందన్నారు. జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, నాయకులు లింగాల చిన్నన్న, అగ్గిమల్ల స్వామి, సుజాత పాల్గొన్నారు.

'మతిభ్రమించే తప్పుడు విమర్శలు'

ఆదిలాబాద్‌టౌన్: రుణమాఫీపై ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకుడు అడ్డి భోజారెడ్డి తప్పుడు విమర్శలు చేస్తున్నారని డీసీసీబీ డైరెక్టర్లు పరమేశ్వర్, పురుషోత్తం ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. అన్నదాతకు అన్యాయం జరిగిందనే ఆవేదనతో వారికి అండగా నిలిచి రైతుల పక్షాన పోరాడిన మాజీ మంత్రి జోగు రామన్నపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఉమ్మడి జిల్లా డీసీసీబీ బ్యాంకు పరిధిలోనే దాదాపు డెబ్బై శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. రైతులకు కష్టం వచ్చిందని అండగా నిలబడిన మాజీ మంత్రిపై వ్యక్తిగత దూషణలు చేస్తూ.. అన్నదాతలకు జరిగిన అన్యాయాన్ని పక్కదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా అనవసర ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు కుమ్ర రాజు, నవాతే శ్రీనివాస్, తమ్మల సతీష్, జవ్వాజి దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

ఇంద్రవెల్లి: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా అన్నారు. బుధవారం మండలంలోని పిట్టబొంగరం పరిధిలోని పాటగూడ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల సమయపాలన రికార్డులు, సరుకుల స్టాక్ రికార్డులను పరిశీలించారు. సబెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: గిరిజన ఆశ్రమ ప్రాథమిక పాఠశాలల్లో మూడు నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఆంగ్ల భాష పఠనం, ఉచ్చారణ, రాత నైపుణ్యాలు పెంపొందించేందుకు ఇంగ్లిష్ లిటరసి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బా గుప్తా అన్నారు. పీఎంఆర్సీలో ఏర్పాటు చేసిన ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ప్రాథమిక స్థాయి తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఒక రోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్ రా వు, ఏసీఎంవో జగన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన క్రీడా వేడులకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పరుగు పందెం పోటీలు నిర్వహించారు. జాతీయ స్థాయిలో రాణించిన 66 మంది క్రీడాకారులను సన్మానించారు. కార్యక్రమంలో ఏసీఎంఓ జగన్, జిల్లా క్రీడల అధికారి పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

త్రీఫేజ్ విద్యుత్ పనులు పూర్తిచేయాలి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన రైతుల భూములకు గిరి వికాసం పథకం ద్వారా అందించిన బోరుబావులకు త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్లు, మోటారు పైపులైన్ల పనులను వెంటనే పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ విద్యుత్ శాఖ, డీఆర్‌డీఓ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్ రావు, ఎస్‌వో సురేష్, గిరి వికాసం కోఆర్డినేటర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆగ్రహం

తలమడుగు: విద్యార్థులు విష జ్వరాలతో బాధపడుతుంటే వైద్య సిబ్బంది ఏం చేస్తున్నారని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర బీసీ వసతి గృహన్ని తనిఖీ చేశారు. విద్యార్థులు జ్వరాలు, రోగాల బారిన పడ్డారని విద్యార్థులు తెలిపారు. ఈసందర్భంగా వసతి గృహంలో వైద్య శిబిరం నిర్వహించారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. వెంటనే విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. హాస్టల్ చుట్టు పక్కల పరిసరాలపై, ఇళ్లలో సర్వే చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌ను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఉపాధ్యాయులు. వైద్యాధికారులు ఉన్నారు.

చోరీ కేసులో ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఖాజా మోయినొద్దీన్ ఇంట్లో ఇద్దరు గుర్తు తెలియని దొంగలు చొరబడ్డారు. ఇంట్లో నుంచి తులం బంగారంతో పాటు రూ.4వేల నగదు అపహరించారు. దీంతో బాధితుడు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ కరుణాకర్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అనుమానం వచ్చిన ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకోగా.. దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడు సయ్యద్ ఉస్మాన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు రతన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ముగిసిన జిల్లాస్థాయి క్రీడా పోటీలు

ఆదిలాబాద్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. క్రికెట్, వాలీబాల్, టగ్‌ఆఫ్‌వార్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, చెస్, 100 మీటర్స్ వాకింగ్, రన్నింగ్, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్ పోటీలను నిర్వహించారు. కాగా విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

సమాచారం

నేడు జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

ఆదిలాబాద్: మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గురువారం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను సన్మానించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేయనున్నారు.

రేపు ఇంటర్ అడ్మిషన్లకు స్పాట్ కౌన్సెలింగ్

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని 3 సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల్లో 2024– 25 విద్యా సంవత్సరానికి సంబంధించి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల 30న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు గురుకులాల జిల్లా సమన్వయ అధికారిణి లలిత ప్రకటనలో తెలిపారు. వీటి భర్తీ కోసం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఉదయం 9గంటల నుంచి కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

రేపు ఎస్జీఎఫ్ జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 30న ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్ 14 బాలుర జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్జీఎఫ్ సెక్రెటరీ సీహెచ్. కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు.